


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 12 సంచిక : 312 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 14 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :312 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 14 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

- ముంబైలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స
- మూడు వారాల పాటు ఫిజియోథెరపీ అవసరమన్న వైద్యులు
- ఆదివారం పవన్‌ను పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు




**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పరామర్శించారు. భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను ఫడ్నవీస్ సోమవారం కలిసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ కుడి భుజానికి శనివారం సుమారు మూడున్నర గంటల పాటు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. 2016లో ఆయన భుజానికి గాయమవగా, ఇటీవలి రాజకీయ పర్యటనల్లో అభిమానులు, కార్యకర్తల తాకిడి కారణంగా ఆ గాయం తీవ్రతరమైంది. దీంతో వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నారని వైద్య బృందం వెల్లడించింది.

- మిగతా 2లో




## పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి 36 ప్రాజెక్టులపై
# సీఎం చంద్రబాబు సమీక్ష

- పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించిన సీఎం చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని నిర్ణయం
- ప్రాజెక్టుల కోసం రూ.35,313 కోట్లు కేటాయించనున్న ప్రభుత్వం
- జలధార పనులకు ప్రతి జిల్లాకు రూ.2 కోట్లు విడుదల చేయాలని ఆదేశం
- 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణకు ఏపీఎస్ఐడీసీకి బాధ్యతలు



**పెన్ పవర్ డెస్క్:**సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, సోమవారం ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్‌లోని గ్యాప్ 1, గ్యాప్ 2తో పాటు పవర్ హౌస్ నిర్మాణ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం, ప్రాజెక్టు ప్రదేశం నుంచే రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ వర్చువల్ సమీక్షలో వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆర్థిక శాఖ అధికారులు పాల్గొన్నారు.రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందుకోసం రూ.35,313 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు, పోలవరం ఎడమ కాలువ పనుల పురోగతి సహా ఇతర ప్రాజెక్టుల వివరాలను కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. సాగునీటి ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు

- మిగతా 2లో

## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం... ఏపీ మంత్రి నారా లోకేశ్ కు ఆహ్వానం

- ఏపీ మంత్రి నారా లోకేశ్ ను కలిసిన ప్రముఖ నిర్మాత బండ్ల గణేశ్
- ఆగస్టు 16న జరగనున్న తన కుమార్తె వివాహానికి ఆహ్వానం
- లోకేష్‌ను 'నెక్స్ట్ జనరేషన్ లీడర్' అంటూ కొనియాడిన బండ్ల
- సోషల్ మీడియాలో ఈ విషయాన్ని పంచుకున్న నిర్మాత
- వైరల్ అవుతున్న బండ్ల గణేష్ పోస్ట్



**పెన్ పవర్ డెస్క్:**ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆగస్టు 16న జరగనున్న తన కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరు కావాలని కోరుతూ ఆయనకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ విషయాన్ని బండ్ల గణేశ్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. "తెలుగుదేశం పార్టీ అగ్రనేత, యువతకు కాబోయే

- మిగతా 2లో

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు... ఏ ముఖం పెట్టుకుని పరామర్శిస్తారు?:

- పరామర్శల పేరుతో జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శ
- విశాఖ పడవ ప్రమాద బాధితులకు 72 గంటల్లోనే రూ.10 లక్షల సాయం అందించిన ప్రభుత్వం
- వైసీపీ హయాంలో 63 మత్స్యకార కుటుంబాలను పట్టించుకోలేదని ఆరోపణ
- వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచి అందించిన కూటమి సర్కార్
- జువ్వలదిన్నెలో చిచ్చుపెట్టాలని చూస్తే ఊరుకోబోమని జగన్‌కు హెచ్చరిక



- మిగతా 2లో



## పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

- పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు
- హెలికాప్టర్ నుంచి పనులను విహంగ వీక్షణం ద్వారా వీక్షించిన సీఎం
- స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల మధ్య పనులపై ఆరా
- గ్యాప్ 1, గ్యాప్ 2 పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- సీఎం వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన హెలికాప్టర్‌లో ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా వీక్షించారు. స్పిల్‌వే నుంచి గోదావరి వరద నీటి ప్రవాహాన్ని, ఎగువ,

- మిగతా 2లో

## షాబాద్ నరహంతకుడు రాజ్‌కుమార్ మృతి



**పెన్ పవర్ డెస్క్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధరించారు. మృతదేహం పక్కన

- మిగతా 2లో

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్.. రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!

- ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని ఒమర్ ఆరోపణ
- ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో బీజేపీ డిమాండ్
- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన కాషాయదళం

**పెన్ పవర్ డెస్క్:**జమ్మూకశ్మీర్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ, ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసును జారీ చేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ



- మిగతా 2లో

## పోలవరం, బనకచర్లపై పిటిషన్.. తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ పిటిషన్
- పోలవరం, కృష్ణా జలాల వినియోగం, బనకచర్ల అంశాలపై దాఖలైన వ్యాజ్యం
- ఏపీ చేపడుతున్న పనులపై స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోరిన తెలంగాణ
- పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలున్నాయన్న ధర్మాసనం
- వాటిని సరిదిద్దకముందే ఏపీకి నోటీసులు జారీ చేయడం కుదరదని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నదీ జలాల వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో



- మిగతా 2లో

## బంకిపూర్ లో నాదే గెలుపు...



### నామినేషన్ వేసిన ప్రశాంత్ కిశోర్

- బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిశోర్
- తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో జన సురాజ్ పార్టీ అధినేత
- ప్రజలు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని వ్యాఖ్య
- బీజేపీ, ఆర్జేడీలతో త్రిముఖ పోటీ నెలకొన్న ఉపఎన్నిక
- అభివృద్ధి, పారదర్శక పాలనే తమ ఎజెండా అని స్పష్టీకరణ

- మిగతా 2లో

## గెలిపించిన యువతే ఇప్పుడు రోడ్డెక్కింది.. నేపాల్ ప్రభుత్వంపై జెన్‌జీ ఆగ్రహం

- 25 ఏళ్ల యువకుడి ఆత్మహత్యతో నేపాల్‌లో భారీ నిరసనలు
- బాలేంద్ర షా ప్రభుత్వాన్ని నిలదీస్తున్న జెన్‌జీ యువత
- పేదలపై దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు ఆపాలని డిమాండ్
- మున్సిపల్ పోలీసుల అధికార దుర్వినియోగంపై తీవ్ర విమర్శలు
- చట్టం ఇవ్వని అధికారాలను వినియోగిస్తున్నారని న్యాయ నిపుణుల ఆరోపణలు



- మిగతా 2లో

## ఆ వార్తలన్నీ అవాస్తవం.. శేఖర్ మాస్టర్‌కు నాకూ గొడవలు లేవు

**పెన్ పవర్ డెస్క్:** నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ తో తమకు ఎలాంటి గొడవలు లేవని, తమ మధ్య యుద్ధం అంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని జానీ మాస్టర్ ) అన్నారు. డ్యాన్సర్స్ అసోసియేషన్ ఎన్నికలు, సభ్యత్వాల విషయంలో ఇరు వర్గాల మధ్య విభేదాలు



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ వర్సెస్ బాబు.. పైచేయి ఎవరిది.. ?

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న రాజకీయాలు గమనిస్తే.. ఎవరిది పైచేయి? అనే ప్రశ్న తరచుగా వినిపిస్తోంది. ప్రభుత్వాధినేతగా కూటమిని ముందుకు నడిపిస్తున్న చంద్రబాబు వైపు, ప్రతిపక్ష నేతగా వైసీపీ అధినేత జగన్ మరోవైపు.. పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. సహజంగానే ప్రభుత్వం లో ఉన్నవారిదే పైచేయిగా ఉంటుంది. అయితే.. ఇది పరిస్థితులను బట్టి ఆధారపడి ఉంటోంది. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం.. చంద్రబాబుదే పైచేయిగా ఉందని అంటున్నారు. వైసీపీ అధినేత జగన్ బయటకు రాకపోవడం, కేవలం ఇంటికే పరిమితం కావడం.. ఆయనపై మైనస్ మార్కులు వేసేలా చేస్తోంది. రెండేళ్ల తర్వాత కూడా జగన్‌లో మార్పు రాలేదన్న వాదన సొంత పార్టీలోనే వినిపిస్తుండడం మరో ప్రధాన అడ్డంకిగా మారింది. వీటికితోడు రాజధాని విషయంలో ప్రజల కోణాన్ని వదిలేశారన్న చర్చ ఉంది. మావిగన్‌పై ప్రజలకు పెద్దగా ఆసక్తి లేకపోయినా.. బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతుండడం కూడా జగన్ రాజకీయాలకు ఇబ్బందిగా మారిందని అంటున్నారు. వీటికితోడు.. జగన్ విషయంలో ఇంకా స్క్రిప్టు రాజకీయాలు కొనసాగుతున్నాయి. ఆయన ఏ విషయాన్నీ నేరుగా చెప్పలేకపోవడం.. పైగా తడబాట్లు వంటివి కొనసాగుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే.. సమాజం లో భారంగా మారిన వారికి వైసీపీ మద్దతు ఇవ్వడం కూడా ప్రజలు హర్షించలేకపోతున్నారు. దీంతో వైసీపీ వెనుకబడిందన్నది ప్రధానంగా చర్చకు వస్తోంది. ఇది జగన్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇదే సమయంలో జగన్ అనుసరిస్తున్న ఏకపక్ష నిర్ణయాలు కూడా.. ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నాయి. ఇక, చంద్రబాబు విషయానికి వస్తే.. క్లీన్ అండ్ నీట్ సీఎంగా పేరు తెచ్చుకున్నారు. ఇది ఆయనకు ప్లస్ అవుతోంది. అదే సమయంలో ప్రతిపక్షంలో 11 మాత్రమే ఉన్నప్పటికీ.. ఎప్పటికప్పుడు లోపాలను ఎత్తి చూపడంతో పాటు.. కొత్త కొత్త పేర్లతో వైసీపీ పై విరుచుకుపడుతున్న తీరుతో ప్రభుత్వంపై ఉన్న ఇమేజ్‌తో పాటు వ్యక్తిగత ఇమేజ్‌ను తగ్గకుండా చూసుకుంటున్నారు. ప్రజలకు భరోసా కల్పించే విషయంలో ఐకాన్‌గా ఉన్నారు. ఇవన్నీ కూడా జగన్‌తో పోల్చి చూసినప్పుడు చంద్రబాబు పైచేయి సాధించేందుకు వీలుగా కనిపిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

# పోలవరం ప్రాజెక్టు సైట్ నుంచి 36 ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- మొదటి పేజి తరువాయి

దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా, ఏపీఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ) ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1023 సాగునీటి పథకాల పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రూ. 3,883 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ పనుల ద్వారా సుమారు 8.42 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా నీరందుతుందని అధికారులు అంచనా వేశారు. దీంతో పాటు, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ఆధునీకరణ కింద మన్యం, విజయనగరం జిల్లాల్లో ప్రత్యేక పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

భూగర్భ జలాలను పెంచేందుకు ఉద్దేశించిన 'జలధార' కార్యక్రమంపై కూడా సీఎం సమీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 11,133 చెరువులు, ఫీడర్ ఛానళ్లను అభివృద్ధి చేసినట్లు అధికారులు వివరించారు. ఈ పనులను వీబీజీ రామ్ జి సంస్థ ద్వారా చేపట్టాలని, జలధార పనుల కోసం ప్రతి జిల్లాకు తక్షణమే రూ. 2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించారు. కాగా, ఈ ఏడాది దేశంలోనే అత్యధికంగా రూ. 2500 కోట్లను ఉపాధి హామీ పథకం కింద ఖర్చు చేసినట్లు అధికారులు ఈ సందర్భంగా సీఎం దృష్టికి తెచ్చారు.

## గెలిపించిన యువతే ఇప్పుడు రోడ్డెక్కింది.. నేపాల్ ప్రభుత్వంపై జెన్‌జీ ఆగ్రహం

నేపాల్‌లో 25 ఏళ్ల రైడ్‌షేరింగ్ డ్రైవర్ గణేశ్ మృతి దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. గత వారం ఖాట్మండులో కస్టమర్ కోసం వేచి ఉన్న సమయంలో పోలీసులు అతని మోటార్‌సైకిల్‌కు వీల్ లాక్ వేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గణేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ మరుసటి రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఈ ఘటనతో ఇప్పటికే ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బయటపడింది. కొన్ని నెలల క్రితమే యువత మద్దతుతో భారీ మెజారిటీ గెలుపొందిన బాలేంద్ర షా ప్రభుత్వంపై ఇప్పుడు అదే జెన్‌జీ తరం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. గత ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి మార్పు కోసం నిలిచిన యువతే ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని జవాబుదారీతనం కోరుతూ వీధుల్లోకి దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదివారం వందలాది మంది సింగ్‌దర్బార్ సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. 'పేదలపై దౌర్జన్యాలు ఆపండి', 'మానవ హక్కులను గౌరవించండి' వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. అక్రమ అరెస్టులను నిలిపివేయాలని, నిర్వాసితులకు ఆశ్రయం కల్పించాలని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మార్చాలని డిమాండ్ చేశారు. మీడియా కథనాల ప్రకారం, బాలేంద్ర షా అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాట్మండు మున్సిపల్ పోలీసులు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, అనధికార వీధి వ్యాపారుల తొలగింపు, నదీతీర ప్రాంతాల్లోని నివాసాలను ఖాళీ చేయించే చర్యల్లో కఠిన వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యల సందర్భంగా అనేకసార్లు ఘర్షణలు చోటుచేసుకోవడంతో పేదల పట్ల ప్రభుత్వం సానుభూతితో వ్యవహరించడం లేదనే అభిప్రాయం బలపడింది.

ఖాట్మండు మెట్రోపాలిటన్ సిటీ మున్సిపల్ పోలీస్ చట్టం-2023 బాలేంద్ర షా హయాంలో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం మున్సిపల్ పోలీసుల బాధ్యతలు నగర ఆస్తుల రక్షణ, పారిశుద్ధ్య పర్యవేక్షణ, పార్కుల సంరక్షణ, స్థానిక ఉత్సవాల నిర్వహణకు సహకరించడం వరకే పరిమితమని నిపుణులు గుర్తు చేస్తున్నారు. లాఠీచార్జ్ చేయడం లేదా ప్రజలను అదుపులోకి తీసుకునే అధికారం వారికి లేదని పేర్కొంటున్నారు.

అయినప్పటికీ, బాలేంద్ర షా ప్రభుత్వంలో మున్సిపల్ పోలీసులు రోజువారీ కూలీలు, వీధి వ్యాపారులపై తరచూ బలవంతపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాంటి ఘటనలకు సంబంధించిన వీడియోలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు గణేశ్ మృతి ఆ అసంతృప్తికి మరింత ఆజ్యం పోసి నేపాల్‌లో మరోసారి భారీ నిరసనలకు కారణమైంది.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్

- మొదటి పేజి తరువాయి

ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు ఆసుపత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కోరుతూ, త్వరగా కోలుకుని ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు పవన్ మూడు వారాల పాటు ఫిజియోథెరపీ తీసుకోవాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ఆయన ఎడమ భుజానికి కూడా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఫడ్నవీస్ పరామర్శ రాజకీయాలకు అతీతంగా నాయకుల మధ్య ఉన్న సౌభ్రాతృత్వానికి నిదర్శనంగా నిలిచింది. తనను పరామర్శించినందుకు ఫడ్నవీస్‌కు పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

## షాబాద్ నరహంతకుడు రాజ్‌కుమార్ మృతి

- మొదటి పేజి తరువాయి

పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. జీవితంపై విరక్తి కలిగిందంటూ.. రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో..మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు.

## ఆ వార్తలన్నీ అవాస్తవం.. శేఖర్ మాస్టర్‌కు నాకూ గొడవలు లేవు

- మొదటి పేజి తరువాయి

వచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు వీడియోలు బయటకు వచ్చాయి. యూనియన్ పెద్దల జోక్యంతో ఆ వివాదం సద్దుమణిగింది. "ఇక్కడ ఎవరికి ఎవరూ శత్రువులు లేరు. మా యూనియన్, డ్యాన్సర్ల కోసం మేము ముందు నిలబడి పనిచేస్తాం. నేను, శేఖర్ మాస్టర్ ఈ రోజు మధ్యాహ్నం అగ్ర కథానాయకుడు చిరంజీవితో కలిసి భోజనం కూడా చేశాం. ఇద్దరం సినిమాలు, పాటలు, డ్యాన్స్ స్టెప్‌లు సహా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. (అందుకు సంబంధించిన వీడియోను చూపించారు) మేమెప్పుడూ ఇలా అన్యోన్యంగా ఉంటాం. మాకు చిరంజీవిగారు ఎప్పుడూ మద్దతుగా నిలుస్తారు. ఆయనే కాదు, ఇండస్ట్రీలో ఉన్న హీరోలు, టెక్నీషియన్స్ మా ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా చిరంజీవిగారికి ధన్యవాదాలు చెబుతున్నా. సినీ పరిశ్రమలో డ్యాన్స్ మాస్టర్లు, డ్యాన్సర్లకు మంచి గుర్తింపు, స్థానం ఉందంటే అందుకు కారణం చిరంజీవిగారే. ఇది యూనియన్‌లో జరుగుతున్న చిన్న సమస్య. మళ్లీ చెబుతున్నా, మా డ్యాన్స్ మాస్టర్‌ల మధ్య ఎలాంటి యుద్ధాలు లేవు. చిన్న చిన్న విషయాల్లో అభిప్రాయభేదాలు మాత్రమే. ఇలాంటివి ప్రతి ఇంట్లోనూ ఉంటాయి" అని అన్నారు.

**ప్రశ్నించిన మాపై దుష్ప్రచారం చేస్తున్నారు: సుమలత**

డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో తాజా పరిణామాలపై అధ్యక్షురాలు సుమలత వివరణ ఇచ్చారు. "అసోసియేషన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా చిన్నవో, పెద్దవో ఏవో తప్పులు జరుగుతూనే ఉన్నాయి. ఒక ప్రెసిడెంట్‌గా బాధ్యత తీసుకుని అసోసియేషన్‌ను ముందుకు నడిపించడం మామూలు విషయం కాదు. ఏది జరిగినా ప్రెసిడెంట్‌నే తప్పు బడతారు. అలా మాట రాకూడదనే నేను ప్రతి దానిని ప్రశ్నిస్తా. ముఖ్యంగా కొందరు డ్యాన్సర్ల దగ్గర డబ్బు దోచుకుంటున్నారు. నిర్మాతల దగ్గర ఒక అమౌంట్ తీసుకుని, అసోసియేషన్‌లో తక్కువ ఇస్తున్నారు. ప్రశ్నించిన మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలా చేసిన వారిని సస్పెండ్ చేశాం. ఆ తర్వాత వాళ్లు రాజీనామా చేశారు. ఇది చాలా మందికి నచ్చడం లేదు. గత పాలనలో నిధుల అవకతవకలు జరిగాయి. గతేడాది ఎన్నికల్లో మేము గెలిచిన దగ్గరి నుంచి ఎన్ని మంచి పనులు చేసినా ప్రతి దానిలోనూ వేలెత్తి చూపుతున్నారు. అందుకే ఈ సమస్యలు వస్తున్నాయి" అని తెలిపారు.

## పోలవరం ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య జరుగుతున్న పనులను ఆయన విహంగ వీక్షణం ద్వారా పరిశీలించారు. అనంతరం, క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా తీశారు. ముఖ్యంగా ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం (ఈసీఆర్ఎఫ్)లోని గ్యాప్ 1, గ్యాప్ 2 పనులతో పాటు, నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనుల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఆయన వెంట జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఉన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు

పనుల పురోగతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

## మత్స్యకారుల మరణాలపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారు... ఏ ముఖం పెట్టుకుని పరామర్శిస్తారు?

ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలను దారుణంగా మోసం చేసి, నట్టేట ముంచి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని పరామర్శల పేరుతో దొంగ నాటకాలు ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ పై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారుల కడుపు కొట్టి, వారి నోటికాడి కూడు లాక్కున్న జగన్ రెడ్డి.. ఇప్పుడు పెద్ద యోగ్యుడిలా పరామర్శల డ్రామాలు ఆడటం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన పడవ ప్రమాదంపై ప్రభుత్వం తక్షణం స్పందించిందని కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో నేవీ, కోస్ట్ గార్డ్ బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడు చిన్నా అందించిన సమాచారంతో 72 గంటల పాటు గాలించినా మిగతా ఆరుగురి ఆచూకీ లభించలేదన్నారు. కోస్ట్ గార్డ్, త్రీ-మెన్ కమిటీ నివేదికల ఆధారంగా వారు మరణించినట్లు నిర్ధారించి, కేవలం 72 గంటల వ్యవధిలోనే బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందించామని వివరించారు. భారతదేశ చరిత్రలోనే ఇంత వేగంగా సాయం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటనను కూడా జగన్ రాజకీయం చేస్తున్నారని కొల్లు రవీంద్ర మండిపడ్డారు. "ప్రభుత్వం బాధితులకు కొండంత ధైర్యాన్నిస్తే.. మీరు శవ రాజకీయాలు చేయడానికి వెళ్తున్నారా?" అని ప్రశ్నించారు. గతంలో వైజాగ్ హార్బర్‌లో 45 బోట్లు కాలి బూడిదైతే కనీసం పలకరించని జగన్, ఇప్పుడు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తన ఐదేళ్ల పాలనలో 63 మంది మత్స్యకారులు సముద్రంలో గల్లంతై చనిపోతే, వారి కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు కూడా ఇప్పించలేని దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి జగన్ అని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ 63 కుటుంబాలకు రూ. 3.15 కోట్ల సాయం అందించి ఆదుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు అండగా నిలుస్తోందని రవీంద్ర వివరించారు. వేట నిషేధ భృతిని ఏకంగా రూ. 20,000కి పెంచి, రూ. 258 కోట్లకు పైగా నిధులను వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. మత్స్యకారుల చెరువుల హక్కులను కాలరాసేందుకు జగన్ తెచ్చిన దుర్మార్గపు జీవో నెం. 217ను రద్దు చేశామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకుండా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని

ఎద్దేవా చేశారు. గతంలో హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు దెబ్బతిన్న బోట్లకు రూ. 6 లక్షల చొప్పున సాయం అందించారని, వేలమంది ఆక్వా రైతులను ఆదుకున్నారని గుర్తుచేశారు. మత్స్యకారుల రక్షణ కోసం 4,560 శాటిలైట్ ట్రాన్స్‌పాండర్లను ఉచితంగా అందించామని, 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని తెలిపారు.

జువ్వలదిన్నె వంటి చోట్ల కులాల మధ్య చిచ్చులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు ఏం చేశారో దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. మత్స్యకారులకు ఏ మేలు జరిగినా అది తెలుగుదేశం, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## బంకిపూర్ లో నాదే గెలుపు...

బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతుండడం తెలిసిందే. బంకిపూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికల్లో ఆయన పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సోమవారం నాడు పాట్నా కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, మద్దతుదారులతో కలిసి వచ్చి ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మీడియాతో మాట్లాడుతూ, ఉపఎన్నిక ఫలితంపై ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఓటర్లు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సంప్రదాయ రాజకీయాలకు విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందువల్ల ఈ పోటీ తమకు ఏమాత్రం కష్టం కాదని తెలిపారు. ఈ ఎన్నికల తీర్పు రాష్ట్రంలో రాజకీయ మార్పుకు నాంది పలుకుతుందని, జన్ సురాజ్ విజన్ పట్ల పెరుగుతున్న మద్దతుకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని ప్రశాంత్ కిశోర్ విశ్వాసం వ్యక్తం చేశారు. బంకిపూర్ ప్రజలు కుల సమీకరణాలు, పాత రాజకీయాలకు బదులుగా అభివృద్ధి, సుపరిపాలన ఆధారిత రాజకీయాలను కోరుకుంటున్నారని పీకే పేర్కొన్నారు. నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలనే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని స్పష్టం చేశారు. బీహార్‌లో అత్యంత ఆసక్తికరంగా మారిన ఈ ఉపఎన్నికలో బీజేపీ, ఆర్జేడీ వంటి ప్రధాన పార్టీలు కూడా తమ అభ్యర్థులను నిలబెట్టాయి. దీంతో ఇక్కడ త్రిముఖ పోరు నెలకొంది.

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్.. రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!

- మొదటి పేజి తరువాయి

చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

**అసలేం జరిగింది?**

ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ. 20 కోట్ల నుంచి రూ. 30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు.

**నోటీసులో బీజేపీ డిమాండ్లు**

ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొంది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్ పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది.

**చర్యలకు సిద్ధమన్న బీజేపీ**

గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ. 100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టం చేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## పోలవరం, బనకచర్లపై పిటిషన్.. తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోర్టును తెలంగాణ తరఫు న్యాయవాది కోరారు. అయితే, తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది. వాటిని సరిచేసే వరకు విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది. ప్రాథమిక లోపాలు సరిదిద్దకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం గానీ, మధ్యంతర ఉత్తర్వులు (ఇంజెక్షన్/స్టే) ఇవ్వడం గానీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ముందుగా పిటిషన్‌లోని లోపాలను సవరించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ఆ తర్వాతే మిగిలిన అంశాలపై విచారణ చేపడతామని పేర్కొంది. అనంతరం కేసు విచారణను వాయిదా వేసింది.

## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం... ఏపీ మంత్రి నారా లోకేశ్ కు ఆహ్వానం

- మొదటి పేజి తరువాయి

నాయకుడు (నెక్స్ట్ జనరేషన్ లీడర్), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ గారిని కలవడం జరిగింది. మా కుమార్తె వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించాల్సిందిగా వారిని ఆహ్వానించాను" అని తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వివాహ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన చిలుకూరి సూర్యతేజతో ఆగస్టు 16న జరగనుంది. గత మే 3వ తేదీన వీరి నిశ్చితార్థం హైదరాబాదులో ఘనంగా జరిగింది.

# 15న జీకే వీధి టీడీపీ మండల విస్తృతస్థాయి సమావేశం



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో ఈ నెల 15వ తేదీ (బుధవారం) మధ్యాహ్నం 12 గంటలకు తెలుగుదేశం పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు తెలిపారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండో బుధవారం నిర్వహించే మండల సమావేశంలో 16 పంచాయతీల గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, యూనిట్ ఇన్‌చార్జీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.అలాగే, ప్రతి పంచాయతీ గ్రామ కమిటీ తమ గ్రామాల్లో ఉన్న అభివృద్ధి సమస్యలపై తీర్మానాలు చేసి సమావేశానికి తీసుకురావాలని సూచించారు. మండల అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## గూగుల్ డేటా సెంటర్ కు వ్యతిరేకంగా సిపిఎం ప్రజా ఉద్యమం



**2 వ రోజు 11,12, వార్డులలో రెండవ రోజు పాదయాత్ర**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జులై 14:** ముడసర్లోవ రిజర్వాయర్ సమీపంలో నిర్మించనున్న గూగుల్ డేటా సెంటర్కు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో 2వ రోజు పాదయాత్ర బాలాజీనగర్ దుర్గాలమ్మ గుడి సెంటర్ నుండి ప్రారంభమై బాలాజీనగర్, జె.ఆర్. నగర్, గాంధీనగర్, శ్రీకాంత్ నగర్, రాజీవ్నగర్, తోటగరువు జంక్షన్ మొదలగు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రనుద్దేశించి సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి. కృష్ణారావు మాట్లాడుతూ డేటా సెంటర్ జనావాసాల మధ్య పెట్టడం వలన అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గత అనుభవాలు తెలియజేస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలో లక్ష మందికి అందిస్తున్న ముడసర్లోవ రిజర్వాయర్ నీరు డేటా సెంటర్ వస్తే ఈ నీటిని కోల్పోయే ప్రమాదముందన్నారు. పర్యావరణం ద్వంసం కావడంతో పాటు క్యాన్సర్ వ్యాధులు వచ్చి ఈ ప్రాంతం నుండి ఖాళీచేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రజలకు హాని కలిగించే డేటా సెంటర్ జనావాసాల మధ్య నుండి తరలించాలని డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి. నరేంద్రకుమార్, డి.అప్పలరాజు, జోన్ నాయకులు డి. నాగరాజు, పి.శంకరరావు, డి. కొండమ్మ, కె. కుమారి, బి.భారతి, పి.వెంకటరావు, రాజశేఖర్, రమణ, సత్యన్నారాయణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


# జలధార--జలహారతి పనులను వేగంగా పూర్తి చేయాలి



**రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులకు కలెక్టర్ నిషాంతి ఆదేశాలు**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్, జూలై 13:**జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార--జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి అధికారులను ఆదేశించారు.సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జలధార--జలహారతి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ పథకం కింద మొత్తం 9,453 పనులు మంజూరయ్యాయని తెలిపారు.వాటిలో 9,430 పనులు ప్రారంభించగా, ఇప్పటికే 9,339 పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ పనుల అమలుకు ప్రభుత్వం రూ. 535.49 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.రాష్ట్రంలోనే అత్యధికంగా 9,453 జలధార--జలహారతి పనులు మంజూరైన జిల్లా అల్లూరి సీతారామరాజు జిల్లా అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చెరువులు, కుంటలు, కాంపౌండ్ ట్యాంకుల పూడికతీత చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు జిల్లాలో పచ్చదనాన్ని ప్రోత్సహించే చర్యలు చేపట్టినట్లు వివరించారు.మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి వర్షపు నీటిని సమర్థవంతంగా సంరక్షించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, ఇరిగేషన్ శాఖ, భూగర్భ జలాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్కరోజు గడువును ప్రజలు సద్వినియోగం చేసుకోండి





- **ఎస్ఐఆర్ ప్రక్రియలో విశాఖ జిల్లా సమగ్ర ప్రగతి**
- **శతశాతం ఫారాల పంపిణీ పూర్తి... 97.53 శాతం డిజిటైజేషన్ తో ముందంజ**
- **జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**

**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూలై 13** ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో విశాఖపట్నం జిల్లా వేగంగా పురోగతి సాధించిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల నాటికి జిల్లాలో మొత్తం 20,23,009 మంది ఓటర్లలో 19,72,971 దరఖాస్తులు డిజిటలైజేషన్ పూర్తికాగా, మొత్తం 97.53 శాతం ప్రగతి నమోదైందని వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు 17,76,335 ఎన్యుమరేషన్ ఫారాలు (87.81 శాతం) డిజిటలైజేషన్ పూర్తయ్యాయని, అదనంగా 26,311 యూనిక్ ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించడం ద్వారా మొత్తం ప్రక్రియలో గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం 78,990 ఫారాలు (3.90 శాతం) డిజిటలైజేషన్ దశలో ఉన్నాయని ప్రకటన ద్వారా చెప్పారు.

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని, పెందుర్తి నియోజకవర్గంలో 91.85 శాతం, విశాఖ తూర్పులో 90.15 శాతం, భీమిలిలో 89.94 శాతం, విశాఖ దక్షిణంలో 88.39 శాతం, విశాఖ ఉత్తరంలో 86.52 శాతం, విశాఖ పశ్చిమంలో 84.56 శాతం, గాజువాకలో 82.44 శాతం డిజిటలైజేషన్ పూర్తైందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికీ సేకరణకు మిగిలిన ఫారాలను క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాల ద్వారా సేకరించి, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, బూత్ స్థాయి అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. జూలై 14వ తేదీ సాయంత్రం వరకు ఈఎఫ్ పత్రాలు వెనక్కి ఇచ్చేందుకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## జిల్లాలో ఎరువుల కొరత లేదు.. రైతులకు సకాలంలో సరఫరా



**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: జిల్లా కలెక్టర్ టి. నిషాంతి**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 13:**ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను ఎలాంటి కొరత లేకుండా అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగుకు అవసరమైన ఎరువులను డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లాలో వ్యవసాయ పంటలు 12,838 హెక్టార్లలో, ఉద్యానవన పంటలు 36 వేల హెక్టార్లలో సాగవుతున్నాయని తెలిపారు.జిల్లా అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1,400 మెట్రిక్ టన్నుల యూరియా, 700 మెట్రిక్ టన్నుల డీఏపీ, 200 మెట్రిక్ టన్నుల ఎంఓపీ అవసరమని అంచనా వేసి తగిన నిల్వలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్‌తో పాటు రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు), ప్రైవేట్ డీలర్లు, ఏపీఎఫ్‌డీసీ కేంద్రాల్లో కూడా తగిన ఎరువుల నిల్వలు ఉన్నాయని చెప్పారు.జిల్లాలో 114 లైసెన్స్ పొందిన రైతు సేవా కేంద్రాలు, 13 ప్రైవేట్ రిటైలర్లు, 3 ఏపీఎఫ్‌డీసీ అవుట్‌లెట్ల ద్వారా రైతులకు ఎరువులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.జూన్ 8 నుంచి ఏపిఏఐఎంఎస్ డిజిటల్ విధానం ద్వారా ఎరువుల పంపిణీని పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 1,324 బస్తాల ఎరువులు రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రైతుల భూమి విస్తీర్ణానికి అనుగుణంగానే సాఫ్ట్‌వేర్ ద్వారా ఎరువుల కేటాయింపు జరుగుతుండటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడిందన్నారు.ఎరువుల కొరతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ సేవలను వినియోగించుకుని అవసరమైన ఎరువులను పొందాలని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి సూచించారు.





# చీకటి సమస్యలకు "వెలుగుల" పరిష్కారం

**సుదీర్ఘ సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే వెలగపూడి**

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 14:** జీవీఎంసీ 12వ వార్డు పరిధిలో పలు ప్రాంతాలలో వీధి దీపాల సమస్య దీర్ఘకాలంగా ఉంది. గతంలో పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సమస్య అలానే ఉండిపోయింది. ఈ సమస్యపై దృష్టి సారించిన వార్డు టిడిపి అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన వీధి దీపాల సమస్యను సత్వరమే పరిష్కరించాలని అధికారులు ఆదేశించి పాత సమస్యలను పరిష్కరించి కొత్త వీధి దీపాలు అవసరమైన ప్రాంతాలను గుర్తించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. వార్డు పరిధిలో అవసరమైన ప్రాంతాలలో సుమారు 70 కొత్త వీధి దీపాలు గుర్తించి సమస్యను పరిష్కరించారు. ఇప్పటివరకు కనకదుర్గ నగర్ రాజీవ్ నగర్ ప్రాంతాలలో 25 దీపాలు అవసరమై ఉండగా సోమవారం 10 వీధి దీపాలను అమర్చినట్లు 12వ వార్డు సెక్రటరీ మరియు 26 వ బూత్ఇంచార్జ్ రామకృష్ణ, సిబ్బందితో కలిసి పర్యటించి వేరే దీపాలను అమర్చి ఏర్పాట్లును పర్యవేక్షించారు.

చాలా కాలంగా పరిష్కారం కానీ వీధి దీపాల సమస్యలు పరిష్కరించినందుకు స్థానిక ప్రజలువారికి ధన్యవాదాలు తెలియజేశారు.





## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికార యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు

* జనసేన నాయకుడు గొర్లె వీర వెంకట్ ప్రశంసలు



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 13:** ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని శాతశాతం విజయవంతం చేసిన ప్రభుత్వ అధికార యంత్రాంగం, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది మరియు ఉన్నతాధికారులకు జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గొర్లె వీర వెంకట్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయడం, అధికారుల నిబద్ధత, సేవాభావం ప్రశంసనీయమని అన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు. రెవెన్యూ శాఖతో పాటు ఇతర కీలక శాఖల అధికారులు పరస్పర సహకారంతో పక్కా ప్రణాళిక ప్రకారం పనిచేయడం, నిరంతర పర్యవేక్షణ, సమర్థ నియంత్రణ, అప్రమత్తమైన విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి అధికారి, ఉద్యోగి, సచివాలయ సిబ్బందికి మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

## చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి!

* ఈనెల 17న. నిరసన జయప్రదం చేయండి.!
* ఐక్య ప్రజా సంఘాల పిలుపు.



**హుకుంపేట పెన్ పవర్. జూలై 13:** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం జూలై 12 ఏజెన్సీ ప్రాంతాల ఆదివాసీలకు 100% ఉద్యోగ నియమక చట్టం చేయాలని,

అలాగే ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 17న పాడేరులో జరప తలపెట్టిన భారీ నిరసన ప్రదర్శన ను జేయప్రదం చేయాలని హుకుంపేట ప్రెస్ క్లబ్ లో ప్రజా సంఘాల నాయకులు,మండల పిసా కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఆదివాసి డీఎస్సీ సాధన కమిటీ కో కన్వీనర్ కూడ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆదివాసి గిరిజన సంఘం కార్యదర్శి టి క్రిష్ణరావు డి ఎల్ ఓ రాష్ట్ర అధ్యక్షులు,తడిగిరి సర్పంచ్ పి. రంజిత్ కుమార్,పిసా మండల అధ్యక్షులు, సీహెచ్ శంకరరావు,జయరాజ్ పాల్గొన్నారు

ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ. ఈ నెల 17న పాడేరు లో జరిగే నిరసన కార్యక్రమాన్నీ జేయప్రదం చేయాలని వారు సంయుక్తంగా పిలుపునిచ్చారు.

అయితే కొందరు గిరిజనేతరలు రిజర్వేషన్ వ్యతిరేక శక్తులు కోర్టును ఆశ్రయించడంతో, వివిధ దశల్లో విచారణ అనంతరం 2020 ఏప్రిల్ 22న సుప్రీంకోర్టు జి.ఓ. నెం.3ను రద్దు చేస్తూ సుప్రీం కోర్ట్ తీర్పు ఇచ్చింది. జి.ఓ. నెం.3 రద్దు అనంతరం గత వైసీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయడంలో తగిన చొరవ చూపలేదు. అనంతరం దాఖలైన రివ్యూ పిటిషన్ కూడా తిరస్కరణకు గురికావడంతో, ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలు సత శాతం. ఉపాధ్యాయ ఉద్యోగ రిజర్వేషన్ అవకాశాన్ని కోల్పోయారు అన్నారు. వాటిని తిరిగి సాధించుకోవడం కోసం 17న జరిగే నిరసనకు పార్టీలకు ,ప్రాంతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు పూపునిచ్చారు ఈ కార్యక్రమానికి టి. క్రిష్ణ రావు.పి. రంజిత్ కుమార్ సీహెచ్. శంకరరావు,జేయరామ్ అప్పలకొండ పడాల్, రామారావు. కోటి తదితరులు పాల్గొన్నారు.

## మిలిటెంట్ ఉద్యమానికి సిద్ధమౌదాం. ఆదివాసి గొంతుని ప్రభుత్వానికి వినిపిద్దాం..!

హుకుంపేట మండల పిసా పోరం పిలుపు.



**హుకుంపేట పెన్ పవర్ జూలై 13:** అల్లూరి జిల్లా హుకుంపేట మండలం పాడేరులో 17 నా జరగబోయే నిరసనను జేయప్రదం కోరి 15బుధవారం నాడు హుకుంపేట మండలం లో మండల పిసా పోరం అధ్యర్యంలో జరుగు సానహాక సభ విజవంతం చెయ్యాలి.

పెసా కమిటీ మండల అధ్యక్షులు సీహెచ్ శంకరరావు ఎస్ జయరాజ్, భవానిశంకర్ పిలుపు నిచ్చారు.

హుకుంపేట మండలం లోని స్థానిక డా'బి ఆర్ అంబేద్కర్ పార్క్ వద్దుకు జులై 15 తేదీన బుధవారం నిర్వహించే సానహాక సభ విజవంతం చెయ్యాలి అన్నారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతు

ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ప్రతిష్టంగా అమలు చేయాలని

జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేసి గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని.

పెసా చట్టం అమలు కై ఉద్యమానికి మండలం లోని 33పంచాయతీలకు చెందిన అన్ని క్లస్టర్ల అధ్యక్ష కార్యదర్శులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఆదివాసీల హక్కులు చట్టాలపై జరుగుతున్న ఉల్లంఘనలు పై చర్చించి ఉద్యమానికి కార్యాచరణ చేయాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో భరత్,కోటి బుజ్జిబాబు, బొంజు బాబు,గణేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పనులను పరిశీలించిన తహసీల్దార్ శైలజ

**పద్మనాభం, జూలై 13 (పెన్ పవర్):** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పద్మనాభం తహసీల్దార్ దారిశెట్టి శైలజ సోమవారం బీఆర్ తాళ్లవలస, గెడ్డపేట, పోత్నూరు, నెరెళ్లవలస, పంద్రంగి గ్రామాల్లో పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి బూత్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా సేకరించిన గణన పత్రాల డిజిటలీకరణ పనుల పురోగతిని పరిశీలించారు. నిర్దేశించిన గడువులోపు గణన పత్రాల డిజిటలీకరణను వంద శాతం పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు.

ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరిని వ్యక్తిగతంగా సంప్రదించాలని, గణన పత్రాలను పూర్తిస్థాయిలో సేకరించి వెంటనే డిజిటలీకరణ చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు, జాప్యాలకు తావులేకుండా నాణ్యతతో పనులు నిర్వహించాలని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోపు లక్ష్యాన్ని సాధించాలని తహసీల్దార్ దారిశెట్టి శైలజ బూత్ స్థాయి అధికారులకు సూచించారు.




## విజ్ఞాన్ లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ , జూలై 13**

దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, విశాఖపట్నం సహకారంతో 20 రోజుల వ్యవస్థాపకత మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు . భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమం 4 తేదీ ఆగస్టు 2026 వరకు కొనసాగనుందని తెలిపారు . విద్యార్థుల్లో వ్యవస్థాపక దృక్పథాన్ని పెంపొందించడం, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించడం, ఆవిష్కరణలు, స్వయం ఉపాధి మరియు స్టార్టప్‌లను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అన్నారు .

ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్, విశాఖపట్నం డిప్యూటీ జనరల్ మేనేజర్ జి. ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాలుగొన్నారు . పార్థ సారథి ఘోష్, బి. వెంకటేశ్వరరావు, కె. మురళీకృష్ణ, బి.ఎస్. పాత్రుడు వనరుల నిపుణులుగా పాల్గొంటున్నారని , తమ విస్తృత పారిశ్రామిక అనుభవం, సాంకేతిక నైపుణ్యాలతో సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల రంగంలో ఉన్న అవకాశాలు, సవాళ్లు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. వ్యవస్థాపకత, వ్యాపార ప్రణాళిక రూపకల్పన, తయారీ సాంకేతికతలు, స్టార్టప్ అభివృద్ధి, ఎంఎస్ఎంఈ పథకాల సద్వినియోగంపై శిక్షణ అందించనున్నారు.

ఈ ఈఎస్‌డీపీ కార్యక్రమంలో వ్యవస్థాపకత, ఉత్పత్తి అభివృద్ధి, తయారీ సాంకేతికతలు, ఆర్థిక నిర్వహణ, మార్కెటింగ్ వ్యూహాలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, వ్యాపార నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర శిక్షణ ఇవ్వనున్నారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు మరియు వ్యవస్థాపక దృక్పథాన్ని పెంపొందించి పరిశ్రమలకు సిద్ధమైన నిపుణులు, విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్ మాట్లాడుతూ, విద్యార్థులు వ్యవస్థాపక దృక్పథాన్ని అలవరచుకొని తమ వినూత్న ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మలచాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఆవిష్కరణల ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. ఎస్. రామ్‌బాబు మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు విద్యాసంస్థలు--పరిశ్రమల మధ్య వారధిగా నిలిచి, విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలు, ఆవిష్కరణ సామర్థ్యం మరియు వ్యవస్థాపక నైపుణ్యాలను మరింత పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డా. వి. రంజిత్ కుమార్, ఎంఎస్ఎంఈ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సమన్వయం చేస్తున్నారు.

## ప్రోటోకాల్‌పై కూటమి నాయకులకు అవగాహన లేదు

వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్




**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 13:** ప్రోటోకాల్‌పై కనీస అవగాహన లేకుండానే కూటమి నాయకులు విమర్శలు చేస్తున్నారని వైసీపీ జీకే వీధి మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్ ఆరోపించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మండల పరిషత్ నిధులతో చేపడుతున్న తాగునీటి బోర్ల శంకుస్థాపనలపై కూటమి నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని అన్నారు. మండల పరిషత్ నిధులను ఏ గ్రామానికి కేటాయించాలనే విచక్షణాధికారం ఎంపీపీకి ఉంటుందని, మంజూరైన పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయడం ప్రోటోకాల్‌లో భాగమేనని పేర్కొన్నారు. అయితే, కూటమి నాయకులే కొన్ని చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి శంకుస్థాపనలు చేయడం ప్రోటోకాల్‌కు విరుద్ధమని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని, రాజకీయ విమర్శలు చేసే ముందు ప్రోటోకాల్‌పై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తమైతే సంబంధిత ప్రజాప్రతినిధులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, సీనియర్ వైసీపీ నాయకులు మత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల భద్రతపై అవగాహనే రక్షణ కవచం:జీకే వీధి ఎస్సై సురేష్

**విద్యార్థినులకు పోక్సో చట్టం, గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై అవగాహన**

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్, జూలై 13:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం రింతాడ జీటీడబ్ల్యూహెచ్ బాలికల పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడెం కొత్తవీధి ఎస్సై సురేష్ పాల్గొని విద్యార్థినులకు పోక్సో (రూజూూ) చట్టం, గుడ్ టచ్--బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలికలు తమపై ఎలాంటి అనుచిత ప్రవర్తన జరిగినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. పిల్లలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు పోక్సో చట్టం కల్పించిన రక్షణ గురించి వివరించారు. అలాగే 18 సంవత్సరాల లోపు బాలికల వివాహాలు చట్టవిరుద్ధమని, అలాంటి వివాహాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. బాల్య



వివాహాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, రక్షణ చర్యలపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆత్మవిశ్వాసంతో ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.


## సామాజిక సేవే రోటరీ ధ్యేయం:క్లబ్ జిల్లా గవర్నర్




**గాజువాక :పెన్ పవర్ ,జులై 13**

పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సౌత్ 41వ వార్షికోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు .క్లబ్ అధ్యక్షుడు వి.శివ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా గవర్నర్ గుత్తికొండ శ్రీరామ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణం చేయించారు. అనంతరం మాట్లాడుతూ క్లబ్ గత 41 ఏళ్లుగా విద్య, వైద్యం,పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, నేత్ర వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు వంటి అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిశీచిందని కొనియాడారు. సమాజ అభివృద్ధికి రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని క్లబ్ అధ్యక్షుడు శివ కుమార్ రెడ్డి తెలిపారు. అనంతరం విశాఖ కెజిహెచ్ వైద్య బృందం నేతృత్వంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సామాజిక సేవలో భాగంగా కెజిహెచ్ కు రెండు ఏసీలు,గర్భిణులకు పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఆర్ రామకృష్ణ రావు,కార్యదర్శి ఉమామహేశ్వరరెడ్డి,కోశాధికారి పద్మావతి,చిక్కా సత్యనారాయణ,డిజిఎన్ శోభన్ ప్రకాష్,మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు

## మాస శివరాత్రి సందర్భంగా బ్రహ్మసూత్ర శివలింగానికి ప్రత్యేక పూజలు.



**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జులై 13 :** మహా విశాఖ నగర పాలక సంస్థ 87 వార్డు పరిధి వడ్లపూడిలో శ్రీ సీతారామలింగేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా బ్రహ్మసూత్ర శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం , లక్ష్మి దంపతులు పూజలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆలయ పురోహితులు నరసింహమూర్తి. సత్యనారాయణ మాట్లాడుతూ సోమవారం. ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి రోజుని పరమేశ్వరుని జన్మనక్షత్రం కారణంగా శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు ,రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరిస్తారని అన్నారు . ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక పూజలో పాల్గొని ఆ భగవంతుని కృపాకటాక్షం పొందుతారని కోరారు . మింది పేరయ్య, బొండా రాజు, ఇర్ల శ్రీరాములు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వంచుల స్వర్ణ సచివాలయంలో సజావుగా ఓటరు ధృవీకరణ ప్రక్రియ


**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 13:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం వంచుల స్వర్ణ గ్రామ సచివాలయంలో సోమవారం ఓటరు ధృవీకరణ (వెరిఫికేషన్) కార్యక్రమం సజావుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ) లొంజా గణపతి పాల్గొని ఓటరు జాబితా పరిశీలనలో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని మెరుగుపర్చే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం పంచాయతీలో ప్రశాంతంగా, సజావుగా కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు.



# బోరు పనుల నిలుపుదలపై కూటమి నాయకుల అభ్యంతరం

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూలై 13:**గూడెం కొత్తవీధి మండలం సంకాడ పంచాయతీలో చేపట్టాల్సిన తాగునీటి బోరు నిర్మాణ పనులు నిలిచిపోవడంపై కూటమి నాయకులు స్పందించారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారులు నిష్పాక్షికంగా వ్యవహరించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు.కూటమి నాయకుల కథనం ప్రకారం, గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం మంజూరైన బోరు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే, కొన్ని పరిపాలనా, ప్రోటోకాల్ అంశాల కారణంగా పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి, అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలకు అవసరమైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు బోరు నిర్మాణ పనులను వెంటనే పునఃప్రారంభించాలని, ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలని కూటమి నాయకులు కోరారు. ప్రజాధనంతో చేపడుతున్న అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సంకాడ టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు, నాయకులు మామిడి చంటిబాబు తదితరులు మాట్లాడుతూ, సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. అవసరమైతే ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ నిరసనను తెలియజేస్తామని పేర్కొన్నారు.ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణ్ బాబును వివరణ కోరగా, రెండు రోజుల్లో గ్రామంలో బోరు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.





## పెందుర్తి జోన్ ప్రజా ఫిర్యాదుల వేదికకు 9 ఫిర్యాదులు

సత్వర పరిష్కారానికి జోనల్ కమిషనర్ శంకర్రావు ఆదేశాలు



**పెందుర్తి, పెన్ పవర్, జూలై 13 :** గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, పెందుర్తి జోన్ పరిధి, వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రజల నుంచి మంచి స్పందనను పొందింది. ఈ వేదికకు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హాజరై తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 9 ఫిర్యాదులు ఈ సందర్భంగా నమోదు అయ్యాయి. ఈ ప్రజా ఫిర్యాదుల వేదికను ప్రజలకు మరింత చేరువగా పాలన అందించాలనే ఉద్దేశంతో నిర్వహించామని అధికారులు తెలిపారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధిదీపాలు, నీటి సరఫరా, ఆస్తి పన్ను సంబంధిత అంశాలపై ప్రజలు ఫిర్యాదులు అందజేశారు. ఫిర్యాదులను స్వయంగా స్వీకరించిన జోనల్ కమిషనర్ శంకర్రావు సంబంధిత శాఖల అధికారులతో ప్రతి ఫిర్యాదును వివరంగా సమీక్షించారు. ప్రజలు చేసిన ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువు లోపల పరిష్కరించాల్సిందేనని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదు పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ "ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం, పారదర్శకత చాలా కీలకం. ప్రజలు నమ్మకంతో తమ సమస్యలను మాకు చెబుతున్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అధికారుల బాధ్యత. చిన్న సమస్య అయినా సీరియస్ గా తీసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే, ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా సమస్యలు నేరుగా అధికారుల దృష్టికి రావడంతో పరిష్కారం మరింత వేగంగా జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వేదికలను క్రమం తప్పకుండా నిర్వహించి, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడంలో ఈ వేదికలు కీలక పాత్ర పోషిస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.?

## సపర్లలో పీజీఆర్ఎస్ నిర్వహణ.. ప్రజల నుంచి ఏడు వినతులు స్వీకరణ



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ సపర్ల గ్రామంలో సోమవారం ఎంపీడీవో బి.హెచ్.వి. రమణబాబు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం ఏడు వినతిపత్రాలు స్వీకరించారు.వినతిపత్రాల్లో గతంలో ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన చట్రాపల్లి గ్రామస్థులకు గృహాలు మంజూరు చేయాలని, సపర్ల ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ గోడలు నిర్మించాలని, తుఫాను వల్ల దెబ్బతిన్న కల్వర్టును పునర్నిర్మించాలని, పాఠశాలలో మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమం అనంతరం ఎంపీడీవో స్థానిక ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అక్కడి సౌకర్యాలు, సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో ఇమ్మానియేల్, గాలికొండ పంచాయతీ ప్రత్యేక అధికారి, పశువైద్యాధికారి లోకుల రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో బాలరేవుల పాఠశాల

- మరమ్మతులకు ధార్మిక సేవా ట్రస్ట్ చొరవ...
- పాఠశాల సందర్శించిన బిజెపి నేతలు

**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 13 :** మండలంలోని బూదరాళ్ల పంచాయతీ బాలరేవుల గ్రామంలో గల మండల ప్రాథమిక ఎలమెంటరీ పాఠశాల పూర్తి స్థిదిరావస్థకు చేరడంతో విద్యార్థుల బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన ధార్మిక సేవా ట్రస్టు ప్రతినిధులు బిజెపి నేతలు గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాల దుస్థితిని చూసి చలించి పోయారు. సమస్యను ధార్మిక సేవా ట్రస్టు ప్రతినిధులకు తెలియజేయడంతో పాఠశాల భవనం మరమ్మతులకు ట్రస్ట్ ప్రతినిధులు చొరవ చూపారు. దీంతో సోమవారం ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో బిజెపి అల్లూరి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జుర్రా గౌరీపార్వతి, బిజెపి మండల అధ్యక్షుడు శివకుమార్, జిల్లా నేతలు మేడి బోయిన చక్కెర రావు (చిన్న),రాజు, త్రినాథ్, టిడిపి నేత చంద్రరావు తదితరులు బాలరేవుల గ్రామానికి వెళ్లి పాఠశాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై గ్రామస్తుల అంగీకారంతో పాఠశాల భవన మరమ్మతులు చేపట్టేందుకు ధార్మిక సేవా ట్రస్ట్ ముందుకు వచ్చినట్లు తెలియజేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పూర్తి శిథిలావస్థలో కూలెందుకు సిద్ధంగా ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించిన డివిడి ప్రసాద్ భావన మరమ్మతులకు అవసరమైన నివేదికలను తయారు చేశారు.



**విద్యార్థులకు పలకలో పుస్తకాలు పంపిణీ:**

శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని మరమ్మతులు చేపట్టేందుకు ధార్మిక సేవా ట్రస్ట్ ప్రతినిధులు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని బిజెపి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జుర్రా గౌరీపార్వతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా సమకూర్చిన పలకలు నోట్ బుక్స్ పెన్నులను స్థానిక నేతలతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులంతా బాగా చదువుకుని రాణించాలని తెలియజేశారు. తమ త్రాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ఇటీవల గ్రామాన్ని సందర్శించి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు హామీ ఇవ్వడంతో పాటు పాఠశాల మరమ్మతులకు చొరవ చూపిన ధార్మిక్ సేవా ట్రస్ట్ ప్రతినిధులకు, సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ కు బిజెపి నేతలకు గ్రామస్తులు పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయుడు లేని పాఠశాల.. వంటమనిషే పిల్లలకు పాఠాలు



**మంగళపాలెం జీపీఎస్‌లో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రుల ఆందోళన**

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జూలై 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ మంగళపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జీపీఎస్)లో ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయని గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విద్యాబోధన బాధ్యతలను తాత్కాలికంగా మధ్యాహ్న భోజన పథకం వంటమనిషి నిర్వహిస్తున్న దృశ్యం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న చిన్నారులకు అర్హత కలిగిన ఉపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంతో, పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో వంటమనిషి వారికి అక్షరాలు, ప్రాథమిక పాఠాలు చెప్పడం కనిపిస్తోంది. గ్రామస్థులు వారి సేవాభావాన్ని అభినందిస్తున్నప్పటికీ, ఉపాధ్యాయుడి స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భర్తీ చేయలేదని పేర్కొంటున్నారు. ప్రాథమిక విద్య పిల్లల జీవితానికి పునాది అని, ఈ కీలక దశలో నాణ్యమైన బోధన అందకపోతే వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఏకైక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కొనసాగడం ఆందోళనకరమని వారు అంటున్నారు.ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మంగళపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్తి స్థాయి ఉపాధ్యాయుడిని నియమించి, విద్యార్థులకు అంతరాయం లేకుండా బోధన జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారుల విద్యతో రాజీ పడకుండా, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని గడుతూరి సత్యనారాయణ కోరుతున్నారు.

# అందరి సమిష్టితోనే గంజాయి రహిత జిల్లా

**రాష్ట్ర ఈగల్ వింగ్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజి) ఆకే రవికృష్ణ**

**డుంబ్రిగుడ పెన్ పవర్, జూన్ 13:** అందరి సమిష్టితోనే గంజాయి రహిత జిల్లాగా తీర్చుదిద్దుదామని రాష్ట్ర ఈగల్ వింగ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీ) ఆకే రవికృష్ణ పిలుపునిచ్చారు అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలం కొర్రాయి పంచాయతీ కొత్తవలస గ్రామంలో పల్లెబాటలో ఈగల్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రచ్చబండ ద్వారా గిరిజనులతో ముఖాముఖీతో గిరిజనుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు గంజాయికి దూరంగా ఉండి ఆదాయ పంటలవైపూ సాగుకు ఊతమిస్తున్నామని గిరిజనులు ముక్తకంఠంతో వెలిబుచ్చారు. ఇంటర్, డిగ్రీలు చదువుకుని ఆర్థిక స్థోమత లేక గిరిజన యువతి, యువకులు ఇంట్లోనే ఉంటున్నారని, యువతకు ఉపాధి కల్పించాలని గిరిజనులు కోరారు. మద్యం, ఇతర అలవాట్లకు బానిసైన యువతకు ఈగల్ కృషితో నెల రోజుల్లో మార్పును తీసుకొచ్చారని మాజీ సర్పంచి కొములు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. ఈగల్ వ్యవస్థతో జిల్లాలో గంజాయి సాగు, రవాణాకు సమూల మార్పులను తీసుకొచ్చిందన్నారు. గంజాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతున్న రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని వేరే రాష్ట్రాలు గంజాయి నివారణకు ప్రయత్నాలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయని కొనియడారు. ఆపరేషన్ చైతన్యంతో సమూల మార్పులతో డ్రోన్, శాటిలైట్ వ్యవస్థ ద్వారా విస్తృత సర్వేను చేపడుతున్నామన్నారు. పల్లెబాటలో ప్రజలతో మమేకంతోనే గంజాయితో కలిగే నష్టాలను చైతన్యం చేస్తున్నామన్నారు. పిల్లల భవిష్యతే తల్లిదండ్రులు ఆశయమని, యువతి, యువకులు గంజాయి జోలికెళ్లకుండా సన్మాన మార్గంలో నడవాలని ఆయన ఆకాక్షించారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గంజాయి సాగుకు బదులు ప్రత్యామ్నయంగా ఆదాయాన్నిచ్చే పంటల సాగుకు చర్యలు చేపట్టి రెండేళ్లలో 35వేల మొక్కలను పంపిణీ చేశామన్నారు. తెలిసి, తెలియక అమయక గిరిజనులు జైలు పాలవుతున్నారని, గంజాయి సాగు, రవాణాకు ఎవరైన సహకరిస్తే 1972కు సమాచారం అందించాలన్నారు. గిరిజన యువతి, యువకులకు ఉపాది కల్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొన్నారు అనంతరం 15గ్రామాల గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు, గిరిజన చిన్నారులకు పలకలు, పెన్ను, నోట్ పుస్తకాలతోపాటు బాలికలకు అట్టలను పంపిణీ చేశారు. గంజాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని గిరిజనులతో ఆయన ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ వింగ్ జిల్లా ఎస్పీ స్వరూప రాణి, అదనపు సూపర్ డెంట్ శ్రీనివాసరావు, ఏఎస్పీ శృతి, అరకు సీఐ కోటేశ్వరరావు, ఎస్సై సురేష్, పోలీసు యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు, గిరిజనులు పాల్గొన్నారు.




## నాయి బ్రాహ్మణుల సెలూన్ షాపులకు విద్యుత్ రాయితీ అమలు చేయాలి

- 200యూనిట్లు దాటిన వినియోగాన్ని డొమెస్టిక్గా పరిగణించాలని కలెక్టర్‌కు వినతి
- జీవో నెం.69 అమలుకు కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర, జిల్లా సంగం





**విశాఖపట్నం, పెన్ పవర్, జూలై13:** రాష్ట్రంలోని నాయి బ్రాహ్మణుల సెలూన్ షాపులకు ప్రభుత్వం జీవో నెం.69 ప్రకారం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అయితే 200 యూనిట్లు దాటిన విద్యుత్ వినియోగానికి వాణిజ్య (కమర్షియల్) టారిఫ్ కాకుండా డొమెస్టిక్ టారిఫ్‌ను వర్తింపజేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, చిన్న స్థాయి సెలూన్ షాపుల నిర్వహణతోనే వేలాది నాయి బ్రాహ్మణ కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం 200 యూనిట్లు మించిన విద్యుత్ వినియోగానికి అధిక కమర్షియల్ చార్జీలు విధించడం వల్ల ఆర్థిక భారం పెరుగుతోందని పేర్కొన్నారు. అందువల్ల 200 యూనిట్లకు పైబడిన వినియోగాన్ని డొమెస్టిక్ విద్యుత్ బిల్లుగా పరిగణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ముసిడిపల్లి రమణ, జిల్లా అధ్యక్షుడు కోడూరు గణపతిరావు, ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు, మహిళా అధ్యక్షురాలు కోడూరు కళావతి, సంఘ నాయకులు మల్లువలస వర్మ, బల్లంకి వెంకట్రావు, గోల్కొండ కర్ణాకర్, చింతపల్లి సూర్య, నల్లబెల్లి సత్యనారాయణ, గోల్కొండ రామకృష్ణ, టెలిగ్రాపు అప్పలరాము, ఆరుపాక కృష్ణ, ఉప్పలపు లోవరాజు, ఎల్.ఏ. నాయుడు, తాటితూరి అప్పారావు, తగరంపూడి రాము, బుద్ధాపు శ్రీను, మేడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 87 వార్డ్ లో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం



**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,జులై 13** జీవీఎంసీ 87వ వార్డ్ గ్రామ సభలో పి ఎస్ నెంబర్ :72 స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ వైస్సార్సీపీ నాయకులు , బిఎల్ ఏ ,బిఎల్ ఓ , అధికారులు లతో కలసి వైస్సార్సీపీ 87వ వార్డ్ ప్రెసిడెంట్. బొడ్డ. గోవింద్ పరిశీలించారు . గాజువాక బి. సి. సెల్. ప్రెసిడెంట్ చిత్రాడ. వెంకటరమణ,స్టేట్ ప్రసార కమిటీ సెక్రటరీ. ప్రగడ. శ్రీనివాసరావు, జి. సన్యాసినాయుడు,
కొన్న. సూర్య ప్రకాష్, పి. శ్రీను,అర్జున్, శ్రీను, ఏ. శ్రీను తదితరులుపాల్గొన్నారు.

## 1373.72 కిలోల అక్రమ గంజాయి పట్టివేత

- దాని విలువ సుమారు 6 కోట్ల 86 లక్షల 86 వేల రూపాయలు.
- జిమాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, ఎస్ఐ పి నాని.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 13.** ముంచంగిపుట్టు పోలీసులు భారీ అక్రమ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జీ మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు తెలిపిన వివరాలలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అక్రమ గంజాయి రవాణా, సాగుపై జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా ముంచింగిపుట్టు పోలీసులు కుజభంగి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా భారీగా గంజాయి రవాణా చేస్తున్న ఒక బొలెరో పికప్ వాహనం పట్టుబడింది. ఒడిస్సా రాష్ట్రం, మల్కన్‌గిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్ నుండి పెదబయలు మండలం జామిగూడ, రూడకోట మీదుగా వస్తున్న ఈ వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో 43 తెల్లటి బస్తాలలో దాచి ఉంచిన 6 కోట్ల 86 లక్షల 86 వేల రూపాయలు విలువైన సుమారు 1373.72 కిలోల గంజాయిని పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిస్సాకు చెందిన దయానిధి ఖోరా అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొంతమంది నిందితులు పరారయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లాలో గంజాయి సాగు ఎక్కడా లేదని, అక్రమ రవాణాపై ఎస్పీ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని జీ మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు స్పష్టం చేశారు. గంజాయి వల్ల జరిగే అనర్థాల గురించి వివరిస్తూ, యువత జీవితాలను పాడుచేసుకోవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## లివిటిలో సర్ ప్రక్రియ పై గ్రామసభ



**హుకుంపేట పెన్ పవర్ జూలై 13.** అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గ హుకుంపేట మండలం.

భారత ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ రాప పంచాయితిలో ఈ కార్యక్రమం పై 115వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న లివిటి గ్రామంలో రాప పంచాయితీ సెక్రెటరీ బి ఎల్ ఓ లు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు ఈ గ్రామ సభకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీసీసీ చైర్మన్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జీసీసీ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు సర్ ప్రక్రియ గూర్చి వివరంగా తెలియజేశారు అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించి ఆ సమస్య లకు పరిస్కారం చేస్తానని హామీ ఇచ్చారు అనంతరం లివిటి గ్రామ మహిళలు చైర్మన్ కు శాలువా కప్పి సత్కారించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల టిడిపి అధ్యక్షులు శతక బొంజుబాబు, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి బాకూరు మాజీ సర్పంచ్ బాకూరు వెంకటరమణ రాజు, హుకుంపేట మండలం మాజీ జెడ్పిటిసి సాగర సుబ్బారావు, టీడీపీ డివిజన్ నాయకులు దారేల మాజీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి, మాజీ కో-ఆపరేటివ్ డైరెక్టర్ టమీకే నూకరాజు, టీడీపీ అరకు ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ మరియు. హుకుంపేట మండలం పెసా కమిటీ అధ్యక్షులు చప్పలి శంకర్ రావు, త్రినాథ్, రాప పంచాయితీ మాజీ వైస్ సర్పంచ్ మోహన్ రావు, హుకుంపేట మండలం బీజేపీ ప్రధాన కార్యదర్శి గంజాయి గంగరాజు, కామేశ్వరరావు, పంచాయితీ సెక్రెటరీ సత్యనారాయణ, బి ఎల్ ఓ లు ప్రసన్న కుమార్, కొండబాబు, ఉమా ప్రియా, సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు బంగారు నాయుడు,రమణమూర్తి, జాన్ బాబు, బలరాం, స్వామి నాయుడు, సింహచలం, ప్రవీణ్, ప్రసన్న, శేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు మర్లే అప్పన్న, మల్లేశ్వరరావు, గణేశ్వరరావు, రామన్న, వార్డు మెంబర్లు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వీబీగ్రామ్ జి ఫీల్డ్ అసిస్టెంట్ లు, వివో ఏ లు, గ్రామ మహిళలు యువత, హుకుంపేట మండలం కూటమి నాయకులు, క్లాప్ మిత్ర లు పండన్న, భైరవ మూర్తి, బి ఎల్ ఎ రాజారావు , పంచాయితీ ప్రజలు పాల్గొన్నారు

## నియోజకవర్గంలో పలు సమస్యలపై ఎమ్మెల్యే కు వినతి పత్రలు.

- గ్రామ సమస్యల పరిష్కారానికి కురుపాం ఎమ్మెల్యేని కలిసిన పలు గ్రామాల ప్రజలు.



**గుమ్మలక్ష్మీపురం జులై 13 పెన్ పవర్.** మండల కేంద్రంలోని కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నాడు నియోజకవర్గంలోని ప్రజలు తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్ ఉ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు.గ్రామంలో ఉన్న సమస్యలను వినతి పత్రాల ద్వారా ఎమ్మెల్యేకు అందజేశారు.సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,ప్రతి సమస్యను ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ,అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు,బిజెపి నాయకులు నిమ్మక సింహాచలం తదితరులు పాల్గొన్నారు

# శ్రమదానంతో కల్వర్టు నిర్మాణం - పట్టించుకోని అధికారులు

- వివిధ గ్రామస్తులు శ్రమదానంతో కల్వర్టు మరమ్మతులు చేపట్టిన వైనం.
- ప్రభుత్వం తక్షణమే స్పందించి కల్వర్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 13.** మండలంలో గల గుమ్మసిరిగంపుట్టు నుండి లక్ష్మీపురం వెళ్లే ప్రధాన రహదారి బరడ గ్రామం వద్ద కల్వర్టు శిథిలావస్థలో చేరి కొన్ని యేళ్ళు గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో బరడ బలియాగూడ, అంటాబొంగు గ్రామస్తులు శ్రమదానంతో కల్వర్టు మరమ్మతులు చేపట్టినట్లు కోడా విక్రమ్, రమేష్, చిత్తరంజన్, ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మాట్లాడుతూ.. బరడ సమీపంలో గల కల్వర్టు గత కొన్ని ఏళ్లుగా శిథిలావస్థలో చేరి ప్రమాదభరితంగా మారి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కల్వర్టు నిర్మాణం కొరకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించిన సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు యువత శ్రమదానంతో కల్వర్టు మరమ్మతులు చేపట్టామన్నారు. కల్వర్టు చుట్టు పక్కల వరద నీరు వెళ్ళటానికి కాలువ తీసి వరద నీరు వేరే మార్గంలో వెళ్లే విధంగా మళ్లించమన్నారు. ఆయా గ్రామస్తులు సమీపంలో గల కొండ నుండి పెద్ద పెద్ద రాళ్ళు మోసి కొని తెచ్చి రహదారి నిర్మించినట్లు తెలిపారు. బుంగాపుట్టు నుండి ముంచంగిపుట్టు వరకు నిత్యం వందల వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయని, పలుమార్లు శిథిలమైన ఈ కల్వర్టు వద్ద ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆ య గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రజలు గంగా, భీమన్న, రాంబాబు, వెంకటరావు, లక్ష్మీపురం గ్రామస్తులు, కొంతమంది సచివాలయం సిబ్బంది పాల్గొన్నట్లు వారు వెల్లడించారు.

# ఆర్ఎస్ఎస్ అజెండా అమలతో విద్యారంగానికి ముప్పు




దేశాన్ని పాలిస్తున్నది 'లీకేజీ' ప్రభుత్వం
ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసే విధానాలపై ఉధృత పోరాటం
ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదర్శ్ ఎం.సాజీ, సృజన్ భట్టాచార్య

**విశాఖ తూర్పు,పెన్ పవర్,జూలై 13:** విశాఖలో విద్యార్థుల భారీ ర్యాలీ, సభ

దేశంలో గడిచిన 12 ఏళ్లకుపైగా పరిపాలన చేస్తున్నది లీకేజీల ప్రభుత్వమని ఎస్ఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సృజన్ భట్టాచార్య, అధ్యక్షులు ఆదర్శ్ ఎం.సాజీ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్ఎస్ఎస్-బిజెపి అజెండాతో విద్యా రంగంలో పలు మార్పులు సంతరించుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ నగరంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో తలపెట్టిన ఎస్ఎఫ్ఐ అఖిల భారత కార్యవర్గ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నగర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని వేమన మందిరం నుంచి సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం వరకూ జరిగిన ఈ ర్యాలీలో వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. 'సేవ్ పబ్లిక్ ఎడ్యుకేషన్', లీకేజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రిజైన్ చేయాలి' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం గురజాడ కళాక్షేతంలో భారీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సృజన్ భట్టాచార్య మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం ప్రభుత్వ విద్య తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఇప్పటికే 1.20 లక్షల ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ద్వారానే దేశ భవిష్యత్‌ను, రాజ్యాంగ విలువలను పరిరక్షించగలుగుతామని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లకు నిధులు కోత విధించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్, జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టిఎ) నిర్వహణలో లోపాలు, సిబిఎస్ఇ మూల్యాంకన సమస్యలు, యుజిసి నెట్, సియుఇటి పరీక్షల్లో తలెత్తిన లోపాలు దేశ విద్యారంగాన్ని ఎత్తి కుదిపేస్తున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్‌లో 51 ఐటిఐల ప్రైవేటీకరణ, ఎపి, తెలంగాణలో టీచర్ పోస్టులు భర్తీకాకపోవడం, అసోంలో ఉన్నత విద్యాసంస్థలకు నిధుల కోత వంటి సమస్యలను ఆయన ప్రస్తావించారు. ఎపిలో ఆర్ఎస్ఎస్- బిజెపి అజెండా అమలవుతోందని అన్నారు. ఒకప్పుడు బిజెపిపై చంద్రబాబు వ్యతిరేకంగా ఉన్నారని, నేడు ఆ పార్టీతో కలిసిపోయి పనిచేయడంతో దేశంలో భిన్నత్వంలో ఏకత్వానికి ముప్పు పెరిగిందని అన్నారు. దేశ రాజ్యాంగం, ప్రభుత్వ విద్య పరిరక్షణకు అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదర్శ్ ఎం.సాజీ మాట్లాడుతూ దేశంలో నీట్, సిబిఎస్ఇల్లో జరిగిన అవకతవకలపై ఎస్ఎఫ్ఐ 24 రాష్ట్రాల్లో 800కుపైగా నిరసన కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వేలాది మంది విద్యార్థులను పోలీసులు ఈ సందర్భంగా నిర్బంధించారని తెలిపారు. 16 మంది విద్యార్థులను జైళ్లకు పంపారన్నారు. కేంద్రంలో బిజెపితో కలిసిపోయిన ఎపిలోని ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా విద్యావ్యవస్థను బలహీనం చేస్తోందని విమర్శించారు. నీట్ పరీక్షల నిర్వహణలో అవకతవకలతో దేశంలో 22 లక్షల మందికిపైగా విద్యార్థులు, సిబిఎస్ఇ మూల్యాంకణ లోపాలతో 16 లక్షల మందికిపైగా విద్యార్థులు నష్టపోయారని తెలిపారు. 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇవి ప్రభుత్వ హత్యలేనని అన్నారు. సంఘం అఖిల భారత సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ మాట్లాడుతూ దేశంలో విద్యావ్యవస్థ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ విద్యావ్యవస్థపై ఉన్మాద దాడులకు తెగబడుతున్నాయన్నారు. విద్య కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లకుండా ఎస్ఎఫ్ఐ పోరాడుతోందన్నారు. సంఘం విశాఖ జిల్లా కార్యదర్శి జి.అజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్ రావు, కె.ప్రసన్న కుమార్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, విశాఖ జిల్లా గర్ల్స్ కన్వీనర్ మౌనిక మాట్లాడారు. వేదికపై సంఘం అఖిల భారత, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# టీడీపీలో చేరిన వైసీపీకి 15 కుటుంబాలు

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.**



**గుమ్మలక్ష్మీపురం జూలై 13 పెన్ పవర్ :** మండలం లో వంగర పంచాయతీ పరిధిలోని సందిగూడ గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 కుటుంబాలు సోమవారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరాయి.గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు,కార్యకర్తలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని అన్నారు.గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు,ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కురుపాం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కడ్రక కళావతి,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్,ఎస్టీ మోర్చా మాజీ బిజెపి జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం,మండల మహిళా జనరల్ సెక్రటరీ పాలక శాంతి కుమారి,దాసరి రామారావు,సోములు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ నిట్ లో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) ప్రారంభం






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జూలై 13:** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కంబషన్ ఇంజిన్ సాంకేతికతల్లో ప్రయోగాత్మక, గణనాత్మక మరియు సుస్థిర దృక్కోణాలు" అనే అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధి ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆన్లైన్ ద్వారా మాట్లాడుతూ శక్తి ఉత్పత్తి, రవాణా, పారిశ్రామిక రంగాల్లో కంబషన్ ఇంజిన్ సాంకేతికతలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ కంబషన్ ఇంజిన్ సాంకేతికతల్లో ఆధునిక పరిశోధనలు, గణనాత్మక విశ్లేషణలు, పర్యావరణహిత సాంకేతిక విధానాలపై ఆచార్యులు, పరిశోధకులు అవగాహనను పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా దేశంలోని ప్రముఖ నిపుణులు పలు అంశాలపై శిక్షణ అందించనున్నారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జీబి.వీరేష్ కుమార్ మాట్లాడుతూ ఆచార్యుల నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కంబషన్ ఇంజిన్ సాంకేతికతల రంగంలో చోటుచేసుకుంటున్న తాజా పరిశోధనలు, గణనాత్మక నమూనాలు, సుస్థిర సాంకేతిక పరిజ్ఞానంతోపాటు వివిధ సాంకేతిక అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్ గా వ్యవరించిన ఆచార్యురాలు డాక్టర్ సునీతా దేవ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆలమూరు విక్రమ భట్టీశ్వర ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

**ఆలమూరు, పెన్ పవర్, జూలై 13;**నిజ జ్యేష్ట మాసం, సోమవారం, ఆరుద్రా నక్షత్రం, (బహుళచతుర్దశి తిథి)మాస శివరాత్రి మహా పర్వదినం కలిసి వచ్చిన మహా శైవాఖ్య యోగం సందర్భంగా దక్షిణ భారతదేశంలోనే ఏకైక ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఆలమూరు శ్రీ భట్టీవిక్రమార్కేశ్వర స్వామి వారి ఆలయంలో భట్టీశ్వర స్వామివారికి ప్రాత: కాలం నుంచే ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రముఖ శైవాగమ పండితులు, టీటీడీ వార్షిక సత్కార గ్రహీత కాళ్ళకూరి సూరిపండు, ఇలపర్తి శాస్త్రి, కాళ్ళకూరి నరేంద్ర శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలి.

-జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ప్రత్యేక పూజలు.



**కిర్లంపూడి, పెన్ పవర్,జూలై 13**:కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో, జనసేన పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు భుజానికి జరిగిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైన సందర్భంగా, వారు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని మరింత శక్తి, ఉత్సాహంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షిస్తూ జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పరమేశ్వర స్వామివారికి వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఏకాదశ రుద్రాభిషేకం తో పాటు అన్నాభిషేకం నిర్వహించారు.శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి 108 బిందులతో కుంకుమ నీళ్లు, పసుపు నీళ్లతో విశేష అభిషేకం నిర్వహించి, పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కు జరిగిన శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం ప్రతి జనసైనికుడికి ఆనందాన్ని కలిగించే విషయమన్నారు. శ్రీ రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళేశ్వర స్వామివారి, శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి అనుగ్రహంతో ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని, మరింత శక్తి, ఉత్సాహంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి వచ్చి ప్రజల సేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్న పవన్ కళ్యాణ్ కు భగవంతుడు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని, త్వరలోనే వారు ప్రజల మధ్యకు వచ్చి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మరింత సేవ చేయాలని ప్రార్థించారు.

ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణ శేఖర్, తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా,కాయల మణికంఠ, పాలెం బాబీ,పత్తి అప్పారావు,గుంటముక్కల చిన్న, గంధం శ్రీను,తుంగపల్లి గోవింద,రేవూరి శ్రీను, వీరబాబు, కొలమూరి బుజ్జి, కొలమూరి భద్ర,గంధం వెంకన్న,జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ పవన్ కళ్యాణ్ గారి త్వరిత ఆరోగ్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## 31న కలక్టరేట్ ధర్నా ను జయప్రదం చేయండి



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 13:** ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఈనెల 31న అంగన్వాడీలు కలక్టరేట్ వద్ద నిర్వహించే స్కీం వర్కర్ల ధర్నాను జయప్రదం చేయాలని అంగన్వాడీల సంఘం జిల్లా కార్యదర్శి ఈ.చంద్రావతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక నెహ్రూ కాలనీ అంగన్వాడీ కేంద్రం వద్ద ఎం.శ్యామల సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని, స్కీం వర్కర్ల ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకరాలు కల్పిండించాలనే డిమాండ్లతో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లాలోని అంగన్వాడీలు ఈ ధర్నా ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి వై వి రాజేశ్వరి, కమిటీ సభ్యులు లక్ష్మి, కృపాభాయ్, వెంకటలక్ష్మి, జ్యోతి, నాగదుర్గ, రామలీల వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు నెలలుగా జీతాలు లేక కొంతంగి పారిశుధ్య కార్మికులు అవస్థలు...

కలెక్టరేట్లో గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రీవెన్స్లో ఫిర్యాదు..



**శంఖవరం పెన్ పవర్ జులై 13:**-కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కొంతంగి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబాల పోషణ భారంగా మారడంతో పాటు అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన పరిష్కారం లభించకపోవడంతో జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కాకినాడ కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా గొర్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామ పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులను నెలల తరబడి జీతాలు లేకుండా పనిచేయించడం అన్యాయమన్నారు. వర్షాలు, ఎండలు లెక్కచేయకుండా ప్రజారోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న కార్మికుల శ్రమకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జీతాలు అందక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

గ్రీవెన్స్లో సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా అధికారులు సమస్యపై వెంటనే స్పందించి, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పెండింగ్లో ఉన్న జీతాల చెల్లింపుపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఆరు నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేసి, ఇకపై ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.

## మాజీ మంత్రి ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలి.

-కిర్లంపూడి మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో కాశీలో ప్రత్యేక పూజలు.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై, 13**: హైదరాబాద్ సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుచున్న మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని

కిర్లంపూడి మాస శివరాత్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం కాశీలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాస శివరాత్రి తోపాటు ఆరుద్ర నక్షత్రం సందర్భంగా కాశీ విశ్వేశ్వరునికి ఏకవారం రుద్రాభిషేకం,అభిషేకము అమ్మవారికి కుంకుమ పూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకుని ప్రజా సేవ చేయాలని ఆ కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆ కాశీ విశ్వేశ్వరుని ఆశీస్సులు ముద్రగడకు మెండుగా ఉంటాయని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పేర్ల వాసు, ముక్కా శ్రీను, లంక మూర్తి, కొత్తల ప్రసాద్, ఇమ్మంది పైడిరాజు, ఇమ్మంది త్రిమూర్తులు, శేశెట్టి అప్పారావు,శేశెట్టి శ్రీనివాస్, పొట్టి అయ్యనస్వామి పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రావులపాలెంలో యువకుడి హత్య.. వ్యక్తిగత కక్షలా? మరో కోణమా?





**రావులపాలెం పెన్ పవర్ జూలై 13:** అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం కొత్తకాలనీలో యువకుడు అను సాయి అలియాస్ నల్ల సాయి (23) దారుణ హత్య స్థానికంగా కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు రాయితో తలపై బలంగా మోది హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.ఆదివారం

అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న రావులపాలెం టౌన్ సీఐ సురేష్ బాబు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్యకు గల కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వ్యక్తిగత విభేదాలు, పాత కక్షలు లేదా ఇతర కారణాలు ఉన్నాయా అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, అనుమానితుల కదలికలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.యువకుడి హత్యతో కొత్తకాలనీ ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే హత్యకు గల అసలు కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.


## జిల్లా ఆరోగ్య వైద్య శాఖ, మున్సిపల్ వైద్యాధికారులు బదిలీలు



**విశాఖ తూర్పు పెన్ పవర్ జులై 13:**జీవీఎంసీ ముఖ్య వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ శ్రీకాకుళం డిఎంహెచ్వో గా బదిలీ పార్వతీపురం మన్యం డి అండ్ ఎం హెచ్ ఓ డాక్టర్. భాస్కరరావు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారిగా నియామకం.

# శివాలయాలలో జన్మ నక్షత్ర మహోత్సవాలు కిటకిటలాడి భక్తులు

- సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా జన్మ నక్షత్ర మహోత్సవాలు





**పెన్ పవర్ ప్రతినిధి, (సామర్లకోట) జూలై, 13:** కాకినాడ జిల్లా లో జన్మ నక్షత్ర మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన
సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్ర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు కంటే జగదీష్ మోహన్,ఈవో బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో అర్చకులు రాంబాబు శర్మ వెంకన్న శర్మ వినయ్ శర్మ సత్య నారాయణ మూర్తి తదితర పండితులు భీమేశ్వర స్వామికి ఆశ్లేష జన్మ నక్షత్ర పూజలను, బాల త్రిపుర సుందరీ దేవికి సహస్ర కుంకుమ పూజలు నిర్వహించారు.రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిగా భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.జన్మ నక్షత్ర మహోత్సవాలను పురస్కరించుకుని ఆశ్లేష నక్షత్ర జాతకులు ఈ స్వామి వారిని దర్శిస్తే మంచి ఫలితాలు చేకూర్తాయని పండితులు వివరించారు.

# మరిడమ్మ జాతర ఉత్సవం ప్రారంభం

- ఉత్సవాలకు ఏర్పాటు పూర్తి
- అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి









**పెన్ పవర్ ప్రతినిధి,( పెద్దాపురం) జూలై, 13:**కాకినాడ జిల్లా పెద్దాపురం లో వేంచేసియున్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం నుంచి ప్రారంభమైనట్లు మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు అసిస్టెంట్ కమిషనర్ కె .విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి ఆగస్టు19వ తేదీ వరకు మొత్తం 37 రోజుల పాటు జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.
జాతర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, గంగమ్మ పూజలు, గ్రామోత్సవాలు, వేదపారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
ప్రసాద విక్రయాలు, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.
అదేవిధంగా, బాలలు, వృద్ధులు, మహిళల భద్రత కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులు ఆలయ అధికారుల సూచనలు పాటిస్తూ జాతరను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# చిన్నారి జ్ఞానేశ్వరి కోసం తల్లిదండ్రులు శివాలయంలో ప్రత్యేక పూజలు





**పెన్ పవర్ ప్రతినిధి, (తుని) జులై 13:** కాకినాడ జిల్లా తుని మండలం సిహెచ్ అగ్రహారంలో. చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యమై 38 రోజులు పూర్తయింది.
స్వామివారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం పాప క్షేమంగా తిరిగి రావాలని కోరుతూ తుని శివాలయంలో తల్లిదండ్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం కావడంతో, ఈ రోజు శివయ్య అనుగ్రహం లభిస్తుందని నమ్మి శాస్త్రోక్తంగా ప్రార్థనలు చేశారు. గత నెల రోజులుగా పాప ఆచూకీ లభించకపోవడంపై కుటుంబీకులు, స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జ్ఞానేశ్వరి సురక్షితంగా తన తల్లిదండ్రులను చేరాలని ఆశిద్దాం.

# మాజీ మంత్రి ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలి.

**-కిర్లంపూడి మాస శివరాత్రి కమిటీ ఆధ్వర్యంలో కాశీలో ప్రత్యేక పూజలు.**



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై, 13:** హైదరాబాద్ సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుచున్న మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని
కిర్లంపూడి మాస శివరాత్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం కాశీలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మాస శివరాత్రి తోపాటు ఆరుద్ర నక్షత్రం సందర్భంగా కాశీ విశ్వేశ్వరునికి ఏకవారం రుద్రాభిషేకం,అభిషేకము అమ్మవారికి కుంకుమ పూజ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం త్వరగా కోలుకుని ప్రజా సేవ చేయాలని ఆ కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆ కాశీ విశ్వేశ్వరుని ఆశీస్సులు ముద్రగడకు మెండుగా ఉంటాయని కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పేర్ల వాసు, ముక్కా శ్రీను, లంక మూర్తి, కొత్తల ప్రసాద్, ఇమ్మంది పైడిరాజు, ఇమ్మంది త్రిమూర్తులు, శేశెట్టి అప్పారావు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సిసి రోడ్లకు మరమ్మత్తు పనులు చేపట్టాలి





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 13:**మాచవరం గ్రామపంచాయతీ పరిధిలో ని వెంకటేశ్వర స్ట్రీట్, నాగాబత్తుల వారిపాలెం, గణేష్ నగర్ కాలనీ, దొమ్మేటి వారి కాలనీ ప్రాంతాలలో సిసి రోడ్లను మాచవరం పంచాయతీ వారు అస్తవ్యస్తంగా తవ్వి ఆ రోడ్లను పూడ్చకుండా వదిలేసి ఆరు నెలలు అయ్యిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొమ్మేటి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో నివాసముంటున్న ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు, విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు, వాహనదారులు వెళ్ళుటకు చాలా వ్యయప్రయాసలు పడవలసి వస్తుందని అన్నారు. ఈ రోడ్లలను అభివృద్ధి పేరుతో గోతులుగా మార్చారని వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు ఇబ్బందిగా ఉన్న రోడ్లను మరమ్మత్తులు చేసి వినియోగ తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ ఆఫీసులో గ్రీవెన్స్ నందు ఫిర్యాదు చేయడమైనది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు మాచవరపు శివన్నారాయణ, ములపర్తి మోహనరావు, కొల్లు సరోజిని, బొంతు శివ, మట్టపర్తి వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల ఐక్యతే సమాజాభివృద్ధికి పునాది

**ఉమ్మడి జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశంలో నాయకుల పిలుపు**



**పెన్ పవర్ రావులపాలెం, జూలై 13 :**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్టీరింగ్ కమిటీ సమావేశం సోమవారం రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించారు. జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ర్యాలీ రాజశేఖర్ ఆధ్వర్యంలో, స్టీరింగ్ కమిటీ చైర్మన్ నక్క చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ బలోపేతం, సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగంపై చర్చించారు.ఈ సందర్భంగా నక్క చిట్టిబాబు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్టీరింగ్ కమిటీని ట్రస్ట్‌గా ఏర్పాటు చేసి, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు విద్య, వైద్యం, సామాజిక సంక్షేమ రంగాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సమావేశంలో రాష్ట్ర పెద్దలు బ్రహ్మశ్రీ దార్ల పాపాయిచార్యులు, బ్రహ్మశ్రీ జె.సి. ప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కటోజు సన్నాయిదాస్, జిల్లా క్రమశిక్షణ సంఘం చైర్మన్ తాళాబత్తుల అప్పలాచార్యులు, వీరమల్ల శ్రీనివాస్, నల్లమాటి నాగబాబు, అవుపాటి ఉమాశంకర్, అనుపోజు సాంబమూర్తి, జిల్లా అధికార ప్రతినిధి గానా సాయి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొచ్చర్ల కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి కోసన భీమశంకర్, చేబ్రోలు గంగా నాగేశ్వరరావు, గార్ల శ్రీనివాస్, తాళాబత్తుల మురళి, కొప్పెల సూర్యనారాయణతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో సంఘాభివృద్ధికి సంబంధించిన పలు తీర్మానాలను ఆమోదించారు.

# ఉప్పలపాడు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు





**గండేపల్లి,పెన్ పవర్,జులై,13:**ఆరుద్ర నక్షత్రం,మాస శివరాత్రి, సోమవారం ఒకే రోజు రావడంతో గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.ఆలయ పురోహితులు చంద్రమౌళి సుబ్బారావు శర్మ తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభించారు.స్వామివారికి
అర్చన,అభిషేకాలు,ప్రత్యేక హోమాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద సంప్రదాయంలో రుద్రుడికి సంబంధించిన నక్షత్రం ఆరుద్ర నక్షత్రం గా పేర్కొంటారన్నారు. శివలింగానికి జలాభిషేకం,బిల్వ దళార్పణ,ఓం నమశ్శివాయ మంత్ర జపం చేయడం శ్రేయస్కరమని అన్నారు.ఈ నక్షత్రంలో శివారాధన ఎంతో విశిష్టమైందని అన్నారు. ఈ మహాయోగంలో శివరాధన చేస్తే వంద మహాశివరాత్రులు చేసినంత పుణ్యఫలాన్ని ఇస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయన్నారు.ఈ రోజు చేసే శివారాధనకు విశేష ఫలితాలు ఉంటాయని సుబ్బారావు శర్మ తెలిపారు.చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలోభక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం అన్న సమారాదన ఏర్పాటు చేశారు.

# ఆదిత్య యూనివర్సిటీ లిట్‌వర్స్ క్లబ్ ఆధ్వర్యంలోవ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలు



**గండేపల్లి ,పెన్ పవర్ , జూలై 13:** గండేపల్లి మండలం ఆదిత్య యూనివర్సిటీ లిట్‌వర్స్ క్లబ్ ఆధ్వర్యంలో, ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో సోమవారం వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మై భారత్ ‘ అనేది సామాజిక చలనశీలత, విద్యా సమానత్వం మరియు ఆచరణాత్మక నైపుణ్యాల ద్వారా భారతీయ యువతను సాధికారం చేయడానికి యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు–
–2026 సందర్భంగా చేపట్టిన ఒక కార్యక్రమం లో భాగంగా భారతదేశ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థి కార్యకలాపాల డీన్ డా. డి. కిషోర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవడం తో పాటు దేశభక్తి, సామాజిక బాధ్యతలను అలవరచుకునేలా ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.వ్యాసరచన పోటీలలో 101 మంది విద్యార్థులు, చిత్రలేఖన పోటీలలో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, జాతీయ ఐక్యత, భారత అభివృద్ధి, దేశభక్తి వంటి అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.పోటీలకు డా. సువర్ణలక్ష్మి న్యాయనిర్ణేతగా వ్యవహరించి, ప్రతిభ, సృజనాత్మకత, అంశానుసారత, ప్రదర్శన ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు. అనంతరం రెండు పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతి విజేతలను ప్రకటించారు.ఈ కార్యక్రమంలో లిట్‌వర్స్ క్లబ్ కోఆర్డినేటర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com